సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 13 । జూన్ । 2025



పారిశుధ్య నిర్వహణపై దృష్టి

కమాన్‌పూర్: డీఎల్‌పీవో సతీశ్ గురువారం పేంచికల్‌పేట గ్రామాన్ని సందర్శించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కార్మికులను ఆయన ఆదేశించారు.



వేతనాల కోసం సిబ్బంది నిరసన

రామగిరి: జెన్‌కో కంపెనీలో సబ్ కాంట్రాక్టు జీవీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని అరెల్లి రమేశ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పరిశ్రమల్లో తనిఖీ చేస్తాం



మాట్లాడుతున్న జడ్జి గణేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): రైస్‌మిల్లులు, ఇటుక బట్టీల్లో ఆకస్మిక తనిఖీలు చేసి బాలకార్మికులు ఉంటే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిఫ్ కోర్టు జడ్జి గణేశ్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బడీడు పిల్లను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. బాలకార్మికులను గుర్తించేందుకు పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులతో కలిసి పరిశ్రమల్లో తనిఖీలు చేయనున్నట్లు జడ్జి తెలిపారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శంకర్, సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి భూమయ్య, ఏజీపీ అంజన్న, న్యాయవాది శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలన్నారు. నోడల్ అధికారి అరుణ, డిప్యూటీ నోడల్ అధికారి మారుతి, డాక్టర్ కేశవరెడ్డి, ఆయుష్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత గ్రామాలు లక్ష్యం



వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాస్

కమాన్‌పూర్(మంథని): టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా ప్రోగాం జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. టీబీ బాధితుల గురించి వైద్యాధికారి సల్మాబేగంను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయని, వీటిని బాధితులకు ఉచితంగా అందిస్తామని తెలిపారు.

వర్షాలు కురవాలని..




కప్పతల్లి ఆట ఆడుతున్న గ్రామస్తులు

ముత్తారం(మంథని): సీతంపల్లి గ్రామస్తులు గురువారం కప్పతల్లి ఆట ఆడారు. కర్రకు కప్పను కట్టి.. దానిపై నీళ్లు పోస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని వానదేవుడికి మొక్కుకున్నారు. అనంతరం భూలక్ష్మి, హనుమాన్ ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్, మాజీ సర్పంచ్ గంగుల రాజలింగు, గ్రామస్తులు ఇరుగురాళ్ల రాయమల్లు, లింగం పెద్ద మల్లయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రికెట్ ఎంపిక పోటీలు

గోదావరిఖనిటౌన్: కరీంనగర్ జిల్లా క్రీడా సంఘం(కేడీసీఏ)లో ఈనెల 14న అండర్–19 క్రికెట్ ఎంపికలు నిర్వహిస్తారని అసోసియేషన్ జిల్లా క్యాంప్ ఇన్‌చార్జి డి.కిరణ్‌కుమార్ యాదవ్, కోచ్ సుదేశ్‌కుమార్ తెలిపారు. అర్హత గల క్రికెట్ క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, సొంత క్రికెట్ కిట్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. కేడీసీఏ అధ్యక్షుడు ఆగమరావు, కార్యదర్శి మురళీధర్, ఉపాధ్యక్షులు మహేందర్‌గౌడ్, మనోహర్‌రావు, అజిత్ పర్యవేక్షిస్తారని వారు వివరించారు.

'సీబీఎస్ఈ' బోధనకు సిద్ధం



పాఠశాలలో ఆధునిక సైన్స్ ల్యాబ్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి చరిత్రలోనే తొలిసారి పాఠశాలల్లో సీబీఎస్ఈ పద్ధతిన విద్యాబోధనకు శుక్రవారం శ్రీకారం చుడుతున్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలను సీబీఎస్ఈ బోధనకు ఎంపిక చేశారు. సీఎండీ బలరాం శుక్రవారం దీనిని ప్రారంభించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

పుస్తకాలు.. పాఠాలు



బడిగంట కొడుతున్న సిబ్బంది



పూలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



పెద్దపల్లి సర్కారు బడిలో ప్రార్థన చేస్తున్న విద్యార్థినులు



తొలిరోజు విద్యాబోధన ఇలా..

వేసవి సెలవులకు బైబై చెప్పిన చిన్నారులు గురువారం ఉల్లాసంగా, ఉత్సాహంగా బడిబాట పట్టారు. తల్లిదండ్రులు, అన్నాచెల్లెలు, తాతమ్మలతో కలిసి తొలిరోజు స్కూల్‌లో అడుగు పెట్టిన చిన్నారులకు ఉపాధ్యాయులు పూలు, పండ్లు అందించి సాదరస్వాగతం పలికారు. తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందించి డిజిటల్ విద్యాబోధన ప్రారంభించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందిస్తున్న డీఈవో మాధవి, ఉపాధ్యాయులు



తల్లితో బడికి వెళ్తున్న చిన్నారి

'సీఎమ్మార్'లో వేగం

- రికార్డుస్థాయిలో బియ్యం డెలివరీ
- వానాకాలం సీజన్‌లో పెరిగిన వేగం
- ముందంజలో పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలు
- జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో నత్తనడకనే సాగిన వైనం



పెద్దపల్లి సమీపంలోని ఓ రైస్ మిల్లులో ధాన్యం మర ఆడిస్తున్న మిల్లు

సాక్షి, పెద్దపల్లి:

రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ (సీఎమ్మార్– మర ఆడించి) చేసి బియ్యంగా ఇవ్వడంలో ఇన్నాళ్లూ జాప్యం చేస్తూ వచ్చిన రైస్ మిల్లర్లు.. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో దిగొస్తున్నారు. సీఎమ్మార్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గ్యారెంటీ బాండ్‌లు ఇచ్చిన వారికే ధాన్యం కేటాయింపులు చేస్తుండడంతో మిల్లర్లు దారికొస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఇటీవల సన్నబియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తుండడంతో రీసైక్లింగ్ దందాకు చెక్‌పెట్టినట్లు అయ్యింది. దీంతో పెద్దపల్లి జిల్లా 90శాతంతో రాష్ట్రంలో రెండోస్థానంలో ఉండగా, కరీంనగర్ నాలుగో స్థానంలో నిలిచాయి. అయితే, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలు సీఎమ్మార్ డెలివరీ చేయడంలో వెనుకబడ్డాయి.

బ్యాంక్ గ్యారెంటీ షరతు

కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ ప్రభుత్వం మిల్లర్లకు ఇస్తోంది. మిల్లర్లు ఒక క్వింటాల్ వడ్లు తీసుకుంటే 68 కిలోల బాయిల్డ్‌రైస్, 67 కిలోల రారైస్ ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో అవసరమైన రేషన్‌బియ్యం కోటా తీసుకొని మిగిలిన బియ్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి అప్పగించాలి. అయితే, ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు ఇప్పటిదాకా తమ ఆర్థికాభివృద్ధికి వినియోగించుకునేవారు. బియ్యం అప్పగించకుండానే ధాన్యాన్ని విక్రయించి ఆ డబ్బుతో వ్యాపారాలు నిర్వహించేవారు. రూ.కోట్ల విలువైన ధాన్యం రైస్ మిల్లర్లుకు వరంగా మారినా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. దీంతోనే మిల్లర్లు సీఎమ్మార్ ఇవ్వడంలో జాప్యం చేసేవారు. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్, రెవెన్యూ, సివిల్ సప్లయీస్, పోలీసు శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టడం, కేసులు నమోదు చేయడంతోపాటు ఆస్తుల జప్తుకూ వెనుకాడడం లేదు. దీంతోపాటు, సీమ్మార్ డిఫాల్ట్‌ను నివారించడానికి బాండ్‌లు ఇచ్చినవారికే ధాన్యం కేటాయింపులు చేశారు. సర్కారు ధాన్యాన్ని ఇప్పటికే విక్రయించిన మిల్లర్లు ఇప్పుడు బయట వడ్లు సేకరించి మరీ మిల్లింగ్ చేసి సర్కారుకు బియ్యం ఇస్తున్నారు. దీంతో సీఎమ్మార్ డెలివరీ వేగవంతమైంది.

2024-25 వానాకాలం సీజన్ సీఎమ్మార్(మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	ఇచ్చిన ధాన్యం	ఇవ్వాల్సిన బియ్యం	ఇచ్చింది	శాతం
పెద్దపల్లి	2,97,379	1,99,750	1,80,487	90
కరీంనగర్	2,60,679	1,75,589	1,43,946	82
జగిత్యాల	3,08,271	2,08,277	1,19,642	57
సిరిసిల్ల	2,11,572	1,42,327	61,364	43

రాష్ట్రంలోనే రెండోస్థానం



రైస్‌మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యం ప్రకారం సీఎమ్మార్‌ను త్వరగా పూర్తిచేయాలి. గత వానాకాలం మిల్లింగ్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా తీసుకున్న చర్యలతో సీఎమ్మార్‌ను వేగంగా సేకరించగలిగాం. రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా రెండోస్థానంలో ఉంది.

– శ్రీకాంత్‌రెడ్డి, డీఎం, జిల్లా పౌర సరఫరాలు

జిల్లాలో నేడు మంత్రుల పర్యటన

- డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పోలీస్‌స్టేషన్ల ప్రారంభం
- బహిరంగ సభలో పాల్గొననున్న శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు



ప్రారంభానికి ముస్తాబైన పెద్దపల్లి మార్కెట్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్

సాక్షి, పెద్దపల్లి: వివిధ అభివృద్ధి పనుల ప్రారంభంలో పాల్గొనేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లాలోని ఎలిగేడులో కొత్త పోలీస్‌స్టేషన్‌ను వారు ప్రారంభించనున్నారు. ఉదయం 10.50 గంటలకు కలెక్టరేట్ సమీపంలో పెద్దపల్లిరూరల్ పోలీస్‌స్టేషన్, 11.10 గంటలకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మార్కెట్ యార్డులో ఉదయం 11.30 మహిళా పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తారు. సాగర్‌రోడ్డు కూరగాయల మార్కెట్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. చందపల్లి, రాంపల్లిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభిస్తారు. చందపల్లిలో మధ్యాహ్నం 12.40కు జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. మంత్రుల పర్యటనకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు.

ఆదర్శ ఉపాధ్యాయులు



జావేద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కుమారుల కోసం ప్రవేశ పత్రం అందిస్తున్న ఉపాధ్యాయుడు రాజు

జ్యోతినగర్(రామగుండం): ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకంతో తాము పనిచేస్తున్న సర్కారు బడుల్లోనే తమ పిల్లలను చేర్పిస్తూ పలువురు ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజు గురువారం జిల్లాలోని కొందరు ఉపాధ్యాయులు తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ జావేద్ తన కుమారుడు నవీదుల్ రెహమాన్‌ను ఏడోతరగతిలో తను పని చేసే స్కూల్‌లోనే చేర్పించారు. హెచ్ఎం గొర్రె జయరాజ్ సమక్షంలో తను పనిచేస్తున్న సర్కారు బడిలోనే చేర్పించి ఆదర్శంగా నిలిచారు. హెచ్ఎం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన చేస్తున్నామన్నారు. ప్రతీఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం జావేద్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు స్వర్ణలత, కల్పన, కృష్ణ, రమేశ్, అనురాధ, ఇస్తేర్, శ్రీధర్‌రావు, అంజన్‌కుమార్, కేడెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుని ఆదర్శం

జూలపల్లి(పెద్దపల్లి): పెద్దాపూర్ గ్రామంలోని ఆదర్శ విద్యాలయంలో పీజీటీ(సివిక్స్) ఉపాధ్యాయుడు ఎస్.రాజు తన ఇద్దరు కుమారులను అదే విద్యాలయంలో గురువారం చేర్పించారు. ప్రిన్సిపాల్ షాదుల్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనపై తల్లిదండ్రులకు ఎంతో నమ్మకం కలిగిస్తున్న సర్కారు ఉపాధ్యాయులు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీ హబ్ భవనం పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్(పెద్దపల్లి): మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేసిన వీ–హబ్ భవనం ఈనెలాఖరు వరకు పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. పెద్దపల్లి మండలం రంగంపల్లిలోని వీ–హబ్, రాఘవాపూర్‌లోని మహిళాశక్తి భవన నిర్మాణాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా వీ–హబ్ భవనం నిర్మిస్తోందన్నారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం పనులు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందుబాటులోని సదుపాయాల గురించి పాఠకులతో చర్చించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేనిపక్షంలో ఆ వివరాలు అందించాలని, వెంటనే వాటిని తెప్పిస్తామని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట అధికారులు తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా 'తుమ్మల'

- 'అడ్లూరి'కి నల్గొండ జిల్లా బాధ్యతలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్థానంలో తుమ్మలను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ల ఇన్‌చార్జి బాధ్యతల్లో ఎలాంటి మార్పు జరగలేదు. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా శ్రీధర్‌బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రిగా పొన్నం ప్రభాకర్‌లను కొనసాగించారు. ఇటీవల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నల్గొండ ఉమ్మడి జిల్లా మంత్రిగా నియమించారు.

కోతుల కట్టడికి రూ.10లక్షలు

- టెండర్లు పిలిచిన బల్దియా అధికారులు
- నగరంలో కోతులను బంధిస్తున్న ఏజెన్సీ సిబ్బంది



ఏజెన్సీ సిబ్బంది పట్టుకున్న కోతులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో కోతుల బెడదను తీర్చడానికి బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. నగరవాసుల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వానరాలను పట్టుకుని సుదూరంలోని అడవుల్లో వదిలియడానికి కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష ఆమోదం, బల్దియా కమిషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు రూ.10 లక్షల అంచనా వ్యయంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇటీవల టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న ఏజెన్సీ బుధ, గురువారాల్లో రామగుండం రైల్వే స్టేషన్‌తోపాటు పరిసరాల్లోని కోతులను పట్టి పంజరాల్లో బంధించారు. నగరంలో అన్నిచోట్ల కోతులను పట్టిస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్ తెలిపారు. ఎక్కడైనా కోతుల బెడద ఉంటే నగరపాలక సంస్థలోని కాల్‌సెంటర్ నంబరు 96036 66444కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

విచారణ.. దర్యాప్తు ఇక వేగవంతం

- అందుబాటులోకి ఎలిగేడు ఠాణా
- నేడు ప్రారంభించనున్న మంత్రులు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు

ఎలిగేడు(పెద్దపల్లి): కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 57వ మండలంగా ఏర్పడిన ఎలిగేడులో పోలీసుస్టేషన్ ఏర్పాటు కల ఎట్టకేలకు నెరవేరబోతోంది. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఠాణాను ప్రారంభించనున్నారు. దీంతో బాధితులు, కేసుల దర్యాప్తు, విచారణ, శాంతిభద్రతల పరిరక్షణ మరింత అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.

గ్రామస్తుల డిమాండ్ పట్టని అప్పటి ప్రభుత్వం

జూలపల్లి మండలం వడుకాపూర్, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామాల్లో అప్పటి సీఎం.. 1999–2000లో జన్మభూమి కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే, ఎలిగేడును మండలంగా ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల ప్రజలు ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శించారు. అంతేకాదు.. అప్పటి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సైతం బహిష్కరించారు. నాటి ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆ సర్కారుపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో 2001లో జూలపల్లి మండలం నుంచి వేరుచేసి 10 గ్రామాలతో కలిపి ఎలిగేడును మండలంగా ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించినా.. పోలీసుస్టేషన్ మాత్రం ఏర్పాటు కాలేదు. అయితే, ఏ సమస్య తలెత్తినా, ఎలాంటి ఘటన జరిగినా, పోలీసు సేవలు అందాలన్నా.. మండల ప్రజలు సుమారు 18 కి.మీ. దూరంలోని జూలపల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్లేవారు. తమ బాధలు తొలగించాలని ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పలుమార్లు అప్పటి డీజీపీ, పోలీసు అధికారులు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు అందజేసినా స్పందన రాలేదు. ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది.

బీఆర్ఎస్ హయాంలో..

బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రంలోని 11 జిల్లాలను 33 జిల్లాలుగా ఏర్పాటు చేశారు. కొత్త మండలాలకు శ్రీకారం చుట్టారు. పోలీసుస్టేషన్లూ ప్రారంభించారు. అయినా, ఎలిగేడుకు పోలీసుస్టేషన్ మంజూరు చేయలేదు.


మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే..

ఎలిగేడులో పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆ హామీ నెరవేర్చుకున్నారు. ఎలిగేడులో ఠాణా మంజూరు చేస్తూ గత డిసెంబర్ 2న జీవో విడుదల చేయించారు. పాత తహసీల్దార్ కార్యాలయ భవనం ఖాళీగా ఉండడంతో దానిని పోలీసుస్టేషన్‌కు అనువుగా ఉంటుందని భావించారు. ఆ భవనాన్ని ఆధునీకరించారు. శుక్రవారం మంత్రుల చేతులమదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

మండలం కేంద్రంలో నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం పరిశీలించారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌ను ప్రారంభించేందుకు మంత్రులు వస్తున్న నేపథ్యంలో అక్కడ చేసిన ఏర్పాట్లపై ఆయన ఆరా తీశారు. ఆర్డీవో గంగయ్య, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్‌రావు, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నా



ఎలిగేడు మండల ప్రజలకల పోలీసుస్టేషన్ ఏర్పాటు. దానిని మంజూరు చేయిస్తానని గత ఎన్నికల్లో ఎలిగేడు మండల ప్రజలకు మాట ఇచ్చిన. దానిని ఇప్పుడు నిలబెట్టుకుంటున్న.

– విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

తీరనున్న కల



ఎలిగేడులో పోలీసుస్టేషన్ ఏర్పాటు కల తీరింది. శుక్రవారం ఠాణాను ప్రారంభించడం సంతోషంగా ఉంది. దీని ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే విజయరమణారావుకు మండల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– తాటిపల్లి సతీశ్‌బాబు, గ్రామస్తుడు, ఎలిగేడు

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 55 ఏళ్ల వయసుగల వ్యక్తి చనిపోయి ఉన్నాడన్న స్థానికుల సమాచారంతో ఎస్సై నరేశ్‌కుమార్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి, వినయ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ముత్యంపేట కారోబార్ రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

భూ వివాదంలో రైతు ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేశ్

కరీంనగర్‌రూరల్: భూ వివాదంలో ఓ రైతు సెల్ఫీ వీడియో తీసుకుని క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడి కథనం మేరకు.. ఆరెపల్లికి చెందిన రైతు వీణవంక రమేశ్‌కు కరీంనగర్ మండలం నగునూరులో వారసత్వంగా వచ్చిన 2.20 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. కొందరువ్యక్తులు దౌర్జన్యంగా భూమిని ఆక్రమించుకుని మోఖాపైకి వస్తే చంపుతామంటూ రమేశ్‌ను బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఈనెల 10న నగునూరులోని భూమి వద్దకు వెళ్లిన రమేశ్ సెల్ఫీవీడియో తీసుకుని తాను క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్టేటస్ పెట్టుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు రమేశ్‌ను చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. రైతు ఆత్మహత్యాయత్నానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భార్య కిడ్నీ ఇచ్చినా దక్కని ప్రాణం

- అమర్చిన మరుసటి రోజే భర్త మృతి


వంగ మల్లేశం (ఫైల్)

కోరుట్ల రూరల్: కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన వంగ మల్లేశం (50) కిడ్నీ మార్చిన మరుసటి రోజే మృతి చెందాడు. మల్లేశంకు ఐదేళ్ల క్రితం రెండు కిడ్నీలు పాడయ్యాయి. అప్పటి నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆయన భార్య లక్ష్మి కిడ్నీ ఇవ్వడానికి అంగీకరించగా.. నెల రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం లక్ష్మి ఓ కిడ్నీ తీసి మల్లేశంకు అమర్చారు. బుధవారం ఆసుపత్రిలోనే మృతి చెందాడు. భర్త ప్రాణాలు కాపాడుకునేందుకు భార్య కిడ్నీ దానం చేసినప్పటికీ మృతి చెందడం కుటుంబంలో విషాదం నింపింది. మల్లేశం దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు.

ఏసీబీ రాడార్‌లో మరికొందరు ఇంజినీర్లు!

- కాళేశ్వరం అడిషనల్ టీఎంసీ ప్రాజెక్టు ఇంజినీర్ నివాసాల్లో సోదాలు
- భారీగా అక్రమాలకు పాల్పడ్డాడని ఏసీబీకి వరుస ఫిర్యాదులు
- రెస్టారెంట్లు, విల్లాలు, ఖరీదైన కార్లు కొన్నట్లు గుర్తించిన ఏసీబీ


బుధవారం చొప్పదండి నవోదయలోని ఇరిగేషన్ ఆఫీస్‌లో విచారణ జరుపుతున్న ఏసీబీ అధికారులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లపై ఏసీబీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు చేసిన ఇరిగేషన్ అధికారి నూనె శ్రీధర్ కాళేశ్వరంలో భాగమైన అదనపు టీఎంసీ పనుల్లో ఇరిగేషన్ క్యాడ్ డివిజన్- 8 ఈఈగా పనిచేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనపై దాడులు జరిగాయి. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. ఈ దాడులు ఒక్కరితో ఆగేలా లేవు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మరింత మంది ఇంజినీర్లపై ఏసీబీ దాడులు జరపనుంది. ఈ డివిజన్లో పనిచేసే పలువురు ఇంజినీర్లు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని ఇటీవల ఏసీబీకి వరుస ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ డివిజన్‌లో మొత్తం నాలుగు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఒక్కో సబ్ డివిజన్‌కు ఒక డీఈఈ, అతనికి సహాయకంగా ఐదుగురు జేఈఈలు పనిచేస్తున్నారు. వీరిలో కొందరు ఆదాయానికి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో దీంతో కొన్ని రోజులుగా ఏసీబీ వీరి ప్రతీ కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టింది. డివిజన్‌లో పనిచేస్తున్న ప్రతీ సిబ్బంది ఆస్తి పాస్తులు, వారు ప్రాజెక్టులో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఆస్తులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించినట్లు సమాచారం. ఇందులో కొందరు ఆస్తుల్లో గణనీయమైన ఎదుగుదల ఉన్నట్లు తెలిసింది. ఈ డివిజన్‌లో పనిచేస్తున్న కొందరు అధికారులు హైదరాబాద్, బెంగళూరుల్లో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అనుమానిస్తోంది. కొన్నిచోట్ల విల్లాలు, రెస్టారెంట్లు, ఖరీదైన కార్లు కొన్నట్లు గుర్తించింది. కొంతకాలంగా వీరి ఇళ్లల్లో జరిగిన వివాహ, ఇతర వేడుకలకు భారీగా వెచ్చించడాన్ని కూడా ఏసీబీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. బుధవారం ఏసీబీ అధికారులు పలు రెస్టారెంట్లలో సోదాలు చేయడమే ఈ డివిజన్‌లో పనిచేసే సిబ్బందికి ఆయా రెస్టారెంట్లలో వాటాలు ఉన్నాయన్న ఖచ్చితమైన సమాచారానికి నిదర్శనం. ఈ నేపథ్యంలో త్వరలోనే మరింత మంది అధికారులపై ఏసీబీ దాడులు చేయనున్నట్లు సమాచారం ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి డివిజన్‌లో పనిచేస్తున్న చాలామంది అధికారులకు స్థానచలనం కలగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లోనూ రాష్ట్రమంతటా ట్రాన్స్‌ఫర్లు జరిగినా.. వీరికి ప్రత్యేక మినహాయింపు రావడం వెనక భారీ లాబీయింగ్ జరిగిందని ప్రచారం సాగుతోంది. మేడిగడ్డ ప్రాజెక్టులో ఇటీవల విచారణ కమిషన్ క్రిమినల్ కేసు నమోదు చేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫారసు చేసిన ఇద్దరు సీనియర్ ఇంజినీర్లు కూడా గతంలో ఇదే అదనపు టీఎంసీ ప్రాజెక్టులో పనిచేసిన వారే కావడం గమనార్హం.

సంతానం కోసం వెళ్తే ప్రాణమే పోయింది

- ఆపరేషన్ వికటించి మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన


రాజవ్వ మృతదేహం


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

జగిత్యాలక్రైం: ఆమెకు సుమారు 18 ఏళ్ల క్రితం పెళ్లయ్యింది. సంతానం లేకపోవడంతో పూజలు చేసింది. దేవుళ్లకు మొక్కింది. పలు ఆస్పత్రుల్లోనూ చూపించుకుంది. అయినా పిల్లలు కలగలేదు. చివరి ప్రయత్నంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయించగా.. వారు ఆపరేషన్ చేయించుకుంటే పిల్లలు పుడుతారని చెప్పడంతో అమ్మతనం కోసం అంగీకరించింది. అయితే ఆ అమ్మతనం పొందకుండానే సదరు ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేస్తున్న సమయంలో మృతిచెందింది. ఈ సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. సారంగాపూర్ మండలం పోచంపేట గ్రామానికి చెందిన అయిత గంగాధర్‌కు అదే గ్రామానికి చెందిన రాజవ్వతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. సంతానం కాకపోవడంతో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలికి చూపించుకుంది. వైద్యురాలు గర్భసంచి ఆపరేషన్ చేస్తే పిల్లలు పుడతారని చెప్పడంతో ఆస్పత్రిలో చేరింది. ఆపరేషన్ చేస్తుండానే మృతిచెందింది. ఆమె మృతికి వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమంటూ ఆమె బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై గీత ఆస్పత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

పోచంపేటలో విషాదం

రాజవ్వ మృతిచెందడంతో ఆమె గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. భర్త గంగాధర్ వ్యవసాయం చేస్తుండగా.. రాజవ్వ బీడీలు చుడుతోంది. దంపతులిద్దరూ అన్యోన్యంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల కోసం ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా నిండు ప్రాణం పోవడంతో గ్రామంలో విషాదం నిండింది.

విద్యార్థుల వికాసానికి దోహదం

- డీఈవో మాధవి


పత్తిపాక పాఠశాలలో జిల్లా విద్యాధికారి మాధవి

ధర్మారం(ధర్మపురి): విద్యార్థుల సంపూర్ణ వికాసానికి, సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. పత్తిపాక ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలపై సమీక్షించారు. విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్ అందించారు. బడిబాట సందర్భంగా నూతనంగా చేరిన విద్యార్థుల వివరాల గురించి హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారని ఆమె తెలిపారు. పదో తరగతి ఫలితాలు, ఎఫ్‌ఎల్‌ఎన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ధర్మారం మండలం అగ్రభాగాన నిలవడవం ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమని ప్రశంసించారు. తొలిరోజే 14 మంది విద్యార్థులు ప్రవేశం పొందడం అభినందనీయమన్నారు. మండల విద్యాధికారి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రావు, మల్లన్న, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు.

16లోగా పుస్తకాలు పంపిణీ చేయాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 16వ తేదీలోగా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు అందించాలని డీఈవో మాధవి సూచించారు. ఇప్పటికే 1,72,348 పాఠ్య పుస్తకాలు పాఠశాలలకు చేరవేశారని, అందులో 50,668 పుస్తకాలు పంపిణీ చేశామన్నారు.

సింగరేణిలో 36మంది అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణిలోని 36మంది సర్వే అధికారులను బదిలీ చేసింది. ఈమేరకు సీఆర్పీ/పీఈఅర్/సీ/26/1956పేరున ఆదేశాలు జారీఅయ్యాయి. కేటీకే-5వ గని సర్వేయర్ ఎస్.సుధాకర్‌ను ఎస్‌ఆర్‌పీ-3కి బదిలీచేశారు. బి.విజయ్‌చందర్ కార్పొరేట్ సర్వే నుంచి కార్పొరేట్ ప్లానింగ్‌కు బదిలీ అయ్యారు. పి.తిరుపతిని ఖైరిగూడ ఓసీపీ నుంచి ఎస్‌ఆర్‌పీ ఓసీపీకి, ఎల్.సత్యనారాయణను ఎస్‌ఆర్‌పీ ఓసీ-2 నుంచి నైనీ ఓసీకి, పి.శ్రీనివాస్‌ను ఎస్‌ఆర్‌పీ-3 నుంచి కేకే ఓసీకి బదిలీచేశారు.

జూనియర్ సర్వే అధికారులు కూడా..

ఎం.రమేశ్‌ను ఆర్జీ-1 జీఎం ఆఫీస్ నుంచి ఓసీ-2కు, ఎం.రాజశేఖర్‌ను భూపాల్‌పల్లి నుంచి కేటీకే ఓసీ-3కి, పి.శ్రీకాంత్‌ను కేటీకే ఓసీ-2 నుంచి ఓసీపీ-3కి, బి.మహేందర్ ఆర్కే-6 నుంచి కాసిపేట-2గనికి, డి.విష్ణువర్ధన్‌ను ఆర్కేపీ ఓసీ నుంచి పీకే ఓసీకి, సీహెచ్ రాజును ఎక్స్‌ప్లోరేషన్ క్యాంపు నుంచి కేటీకే-1, 1ఏ గనికి, బి.నరేందర్‌ను ఓసీపీ-3 నుంచి ఎస్‌ఆర్‌పీ ఓసీ-2కి, టి.సంపత్‌ను మందమర్రి నుంచి ఎస్‌ఆర్‌పీ ఓసీ-2కు, ఎ.కిరణ్‌కుమార్‌ను పీకే ఓసీ నుంచి మణుగూరు ఓసీకి బదిలీ చేశారు. అదేవిధంగా పి.సతీశ్‌ను జీడీకే సీఎం నుంచి ఓసీపీ-3కి, పి.వివేక్‌ను కేకేఓసీ నుంచి ఐకేఓసీకి, జి.ప్రశాంత్‌కుమార్‌ను మణుగూరు ఓసీ నుంచి సర్వే కార్పొరేట్కు, వి.రాజును వీకేపీ నుంచి సర్వే ఆర్జీ-1కు, జి.వెంకటనర్సింహారాజును కాసిపేట-2 నుంచి ఐకే-1ఏకు, వై.మొండయ్యను ఓసీపీ-1 నుంచి జీడీకే-2,2ఏ, 5 సీఎంకు, ఎం.సైదులును ప్రాజెక్టు ప్లానింగ్ నుంచి పీకే ఓసీకి, ఇ.సంజీవరాజును ఓసీపీ-2 నుంచి ఎక్స్‌ప్లోరేషన్ ఆర్జీ-1కు, ఎం.విజయ్‌ను కేటీకే ఓసీ-3 నుంచి కేటీకే ఓసీ-2కు, ఎం.గంగాధర్‌ను ఎస్‌ఆర్‌పీ ఓసీ-2 నుంచి ఖైరిగూడ ఓసీకి, కె.వివేకానందరావును ఎస్‌ఆర్‌పీ ఓసీ-2 నుంచి మందమర్రికి, బి.వెంకటేశ్వర్‌రావును కిష్టారం ఓసీ నుంచి పీకే ఓసీకి బదిలీ చేశారు. ఎం.ప్రసాద్‌ను పీకే ఓసీ నుంచి కేటీసీకి, పి.గంగయ్యను కేకేఓసీ నుంచి ఓసీపీ-3కి, ఆర్.విష్ణువర్ధన్‌ను ఎస్‌ఆర్‌పీ ఓసీ-2 నుంచి గోలేటి ఓసీకి, ఎస్.రాజస్వామిని ఖైరిగూడ ఓసీ నుంచి భూపాల్‌పల్లికి, ఎస్.రవీందర్‌ను ఇందారం-1ఏ నుంచి కేకే ఓసీకి, పి.సురేశ్‌కుమార్‌ను కార్పొరేట్ నుంచి కిష్టారం ఓసీకి, ఎల్.సమ్యానాయక్‌ను వీకేపీ నుంచి ఐకే-1ఏకు, ఎండీ అజాంపాషాను శాంతిఖని నుంచి నైనీ ఓసీకి, ప్రశాంత్‌ను కేటీకే-1,1ఏ నుంచి కేటీకే-5కు, బి.గురుప్రసాద్‌ను పీకే ఓసీ నుంచి వీకే ఓసీకి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

జాతీయ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి ఒలింపియాడ్ పోటీల్లో బంగారు పతకాలు, నగదు ప్రోత్సాహకం అందుకున్నారని సంస్థ చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక అల్ఫోర్స్ స్కూల్‌లో గురువారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో రసజ్ఞ (9వ తరగతి) బంగారు పతకం, కంప్యూటర్ ఒలింపియాడ్‌లో హేమంత్ జాదవ్ (10వతరగతి) బంగారు పతకం, హిందీలో ఎ.శ్రీయాన్‌రెడ్డి (4వ తరగతి), యు.సాత్విక్ (6వ తరగతి), ఇ.లిఖిత్ కుమార్ (8వ తరగతి), పి.నమన్విత (10వ తరగతి) బంగారు పతకాలు, సోషల్ ఒలి ంపియాడ్‌లో హవీశ్‌రెడ్డి (6వ తరగతి), యం.శివేన్ రెడ్డి (8వ తరగతి) బంగారు పతకాలు, సోషల్ ఒలింపియాడ్‌లో ఎ.యశ్‌చంద్ర (9వ తరగతి)స్టేట్ టాపర్‌గా, నేషనల్ ఎస్సే ఒలింపియాడ్‌లో బి.తన్మయి (7వ తరగతి) స్టేట్‌ర్యాంక్, ఇంటర్నేషనల్ డ్రాయింగ్‌లో ముగ్ధా హాసిని (10వ తరగతి) స్టేట్ ర్యాంక్, సోషల్‌లో ఎ.శ్రీయాన్ రెడ్డి (4వ తరగతి) స్టేట్ ర్యాంక్‌లు సాధించడం హర్షణీయమన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి

- కేసు నమోదు


తలకు గాయమైన కసుబోజుల వెంకన్న

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడిపై అదే పార్టీకి చెందిన ఓ నాయకుడు దాడిచేశాడని టౌన్ సీఐ ఎస్.రామకృష్ణ గురువారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొత్తపల్లిలోని కసుబోజుల వెంకన్న ఇంటికి బుధవారం రాత్రి వెళ్లిన దేశిని కోటేశ్వర్ (కోటి) రాబోయే ఎన్నికల్లో తనకు సపోర్టు చేయాలని బెదిరిస్తూ కర్రతో తలపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన అతని భార్యపై సైతం దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తిరుపతికి ప్రత్యేక రైలు

- మంత్రి పొన్నం విజ్ఞప్తికి స్పందించిన రైల్వే

కరీంనగర్ కార్పొరేషన్/ కరీంనగర్ రూరల్: కరీంనగర్ నుంచి తిరుపతికి రైళ్ల సేవలను పెంచుతూ గురువారం రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తికి స్పందించిన రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక రైలును జూలై 6 నుంచి నడిపించనున్నారు. ప్రతి ఆదివారం రాత్రి 7.45 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి, సోమవారం ఉదయం 10గంటలకు కరీంనగర్ చేరుకుంటుంది. సోమవారం సాయంత్రం 5.30కు కరీంనగర్ నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 8.25కు తిరుపతి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు రద్దీని బట్టి రెగ్యులర్‌గా నడిచే అవకాశముంది. ఈ సందర్భంగా రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్రమంత్రి బండి సంజయ్‌కి పొన్నం ధన్యవాదాలు తెలిపారు. ఈ రైలును ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలు

జగిత్యాలజోన్: ఇంటర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.12,200 జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి, పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి సి.రత్న పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కథనం ప్రకారం.. గొల్లపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. కరోనా సమయంలో లాక్‌డౌన్‌తో ఇంటి వద్ద ఆన్‌లైన్‌లో క్లాస్‌లు వింటోంది. బాలిక ఇంటి పక్కన ఖాళీ స్థలం ఉండగా.. అదే గ్రామానికి చెందిన రెడపాక శ్రీనివాస్ ఎప్పుడూ బాలిక ఇంటి వైపు చూస్తుండేవాడు. 26 జనవరి 2021న బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. బాలిక ఇంట్లో బట్టలు మార్చుకుంటోంది. శ్రీనివాస్ ఇంట్లోకి వెళ్లి ఆమెపై అత్యాచారం చేయబోయాడు. బాలిక పరుగెత్తుకుంటూ బయటకు వచ్చి తల్లితండ్రులకు ఫోన్ ద్వారా తెలిపింది. దీంతో వారు గొల్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై బి.జీవన్ కేసు దర్యాప్తు చేపట్టారు. శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, శ్రీధర్, రాజు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. పరిశీలించిన జడ్జి నిందితుడైన శ్రీనివాస్‌కు మూడేళ్ల జైలు, రూ.12,200 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

తరగతి గదుల్లోనే దేశభవిష్యత్

- ఎమ్మెల్సీ మల్క కొమురయ్య


పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, డీఈవో మాధవి, ఎంఈవో మహేశ్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): దేశభవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలిరోజు గురువారం ఎమ్మెల్సీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు జాతీయతభావం, దేవభక్తి, నైతిక విలువలు, క్రమశిక్షణ అలవర్చాలని, అందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశానని గుర్తుచేశారు. డీఈవో మాధవి, ఎంఈవో మహేశ్ కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషితో బడిబాట ద్వారా మండలస్థాయిలో మొత్తం 250 మంది విద్యార్థులను ప్రవేశాలు కల్పించామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత, పీఎస్ హెచ్‌ఎం రాజారాం, మాజీ ఎంపీటీసీ గూడెపు జనార్దన్‌రెడ్డి, నాయకులు కావేటి రాజగోపాల్, ఈర్ల శంకర్, చిలువేరు సదాశివ, రఫీ, గరిడె కిషన్, ముల్కోజు వెంకన్న, తిరుపతి, సీను తదితరులు పాల్గొన్నారు.

శాతవాహనలో ఎంఫార్మసీ కోర్సుకు ఆమోదం

కరీంనగర్‌టౌన్: శాతవాహన విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఫార్మసీ కోర్సును ప్రారంభించడానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపినట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి యు.ఉమేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేరుడ్యాం పక్కన ఉన్న ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ఈనూతన ఎంఫార్మసీ కోర్సును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఫార్మకాలజీ, ఫార్మాసిటిక్స్, ఫార్మసిటికల్ అనాలసిస్ విభాగాలలో 15 సీట్లు చొప్పున మొత్తం 45 సీట్లకు అడ్మిషన్లకు అనుమతి లభించిందన్నారు. ఇదే కళాశాలలో ఫార్మసీ విద్యను అభ్యసించిన వారికి పీజీ కూడా ఇక్కడే చదువుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం, రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్ వీసీ ఉమేశ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్‌శివారులో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొని తాటికొండ పుష్పలీల(65), రామస్వామి (68) దంపతులు చనిపోయారని ఎస్సై రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రామస్వామి, పుష్పలీల ద్విచక్రవాహనంపై హుజూరాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో మండలంలోని కాచాపూర్ శివారులో వీరి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. పుష్పలీల అక్కడికక్కడే మరణించింది. రామస్వామికి తీవ్రగాయాలు కాగా 108 లో వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

మలేసియాలో గుండెపోటుతో మల్లాపూర్ వాసి..

మల్లాపూర్: ఉపాధి కోసం మలేసియా వెళ్లిన మల్లాపూర్ మండలకేంద్రానికి చెందిన నారి తుక్కారాం (35) పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందినట్లు గురువారం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. స్థానికుల కథనం ప్రకారం.. తుక్కారాం ఉపాధి కోసం కొంతకాలంగా మలేసియాకు వెళ్లివస్తున్నాడు. ఈనెల 3న అక్కడే గుండెపోటు రావడంతో మరణించాడు. అక్కడి భారతీయుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తుక్కారాం మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులను కోరారు.

పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య

తిమ్మాపూర్: పెళ్లైన నెల రోజుల్లోపే యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రేణికుంట గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన పెసర శ్రీకాంత్(30)కు మే 16న వివాహమైంది. వారం క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. శ్రీకాంత్ బుధవారం అత్తగారింటికి వెళ్లి వచ్చిన తర్వాత పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఉరేసుకొని యువకుడు..


రోహిత్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీ షిర్కె క్వార్టర్స్ ఏరియాలో నివాసం ఉంటున్న గోషిక రోహిత్(29) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రోహిత్.. మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. ఆ తర్వాత తన గదిలోకి వెళ్లడంతో అతను నిద్రపోయాడని కుటుంబ సభ్యులు భావించారు. సాయంత్రం వరకూ కుమారుడు బయటకు రాకపోవడంతో గదిలోకి వెళ్లి చూడగా అప్పుడికే ఉరేసుకొని కనిపించాడు. తమ కుమారుడిని కొందరు ఆర్థికపరమైన లావాదేవిల కోసం కొంతకాలంగా వేధిస్తున్నారని మృతుని తండ్రి అశోక్ పోలీసులకు తెలిపాడు. ఈవిషయంపై తమకు ఫిర్యాదు అందలేదని గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలపూ విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

■ మీ బంగారం ముణప్పురం ముత్తూట్, మర్వాడి షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మాడబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783417]

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [IA-465]

WANTED

■ పార్ట్‌టైమ్ జాబ్ : వర్క్ ఫ్రం హోమ్ Thulir Digitalsలో వర్క్ చేయుటకు గృహిణులు, స్టూడెంట్స్, స్త్రీ, పురుషులు కావలెను. A : 18-45Y, Sal : 3K -15K. సంప్ర : ✆ 63017 21339 [B-170]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

మహిళా ఠాణాకు పోలీస్ అధికారుల నియామకం

- రెండు కొత్త పోలీస్ స్టేషన్లకూ ఎస్సైలు


కె.పురుషోత్తం


బుద్దె మల్లేశ్


సత్యనారాయణ


జి.అశోక్‌రెడ్డి

గోదావరిఖని: జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రారంభించే మహిళా పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు పోలీసు అధికారులను నియమిస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా గురువారం ఆదేశాలు జారీచేశారు. కమిషనరేట్‌లోని సీఎస్‌బీ-3 సీఐగా పనిచేస్తున్న కె.పురుషోత్తంను మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా, వీఆర్ రామగుండంలో కొనసాగుతున్న జి.అశోక్‌రెడ్డిని ఎస్సైగా బదిలీ చేశారు. అదేవిధంగా పెద్దపల్లి ఎస్సై-2గా పనిచేస్తున్న బుద్దె మల్లేశ్‌ను పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా బదిలీ చేశారు. వీఆర్ రామగుండంలో పనిచేస్తున్న టి.సత్యనారాయణను ఎలిగేడు పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బదిలీ చేస్తూ ఆదేశిలిచ్చారు.

చోరీ కేసులో మూడునెలల జైలు

మెట్‌పల్లిరూరల్: ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో వ్యక్తికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించిందని ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులో 2021 నవంబర్ 26న ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు అప్పటి విద్యుత్ ఏఈ త్రిమూర్తి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఏపీలోని ఒంగోలు జిల్లా సింగరాయకొండకు చెందిన పల్లిపాటి ఏసుదాసు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసినట్లు గుర్తించారు. అతడిని పట్టుకొని విచారించి 87 ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్‌వైర్, ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. ఏసుదాసును కోర్టులో హాజరుపర్చగా వాదనలు విన్న జగిత్యాల అడిషనల్ సెషన్స్ జడ్జి నారాయణ నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్సై పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో..

వేములవాడ: పాతకక్షలతో దాడిచేసి గాయపరిచిన కేసులో కట్ట గంగరాజుకు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.400 జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజయ్‌కుమార్‌జాదవ్ గురువారం తీర్పునిచ్చినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బోయినపల్లి మండలం తడగొండకు చెందిన వేముల సాయితరుణ్(19) దసరా పండుగను పురస్కరించుకొని 2020 అక్టోబర్ 25న వేంకటేశ్వరగుడి వద్ద ఏర్పాటు చేసిన జమ్మిని చూసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన కట్ట గంగరాజు పాతకక్షలు మనసులో పెట్టుకుని సాయితరుణ్‌పై సిమెంట్ ఇటుకతో దాడి చేశాడు. బాధితుడి తల్లి బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా గంగరాజుపై హత్యాయత్నం కేసు నమోదైంది. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి గంగరాజుకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.400 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రాజన్న ఆదాయం రూ.86.85 లక్షలు



వేములవాడ: రాజన్నకు 15 రోజుల్లోనే హుండీల ద్వారా రూ.86,85,307 నగదుతోపాటు 83 గ్రాముల బంగారం, 5.500 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. ఓపెన్‌స్లాబ్‌లో గురువారం కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల మధ్య హుండీలోని డబ్బులను ఆలయ అధికారులు, సిబ్బంది, రాజరాజేశ్వర సేవ సమితికి చెందిన 570 మంది లెక్కించారు. ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఎస్పీఎఫ్, భద్రత సిబ్బంది పర్యవేక్షించారు.